

ప్యాలెస్ కాదు.. వైసీపీ కార్యాలయం

ఆ పార్టీ విశాఖ నేతల బరితెగింపు

- ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- ఎకరా రూ.50 కోట్ల విలువైన భూమికి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున చెల్లింపు

-7లో

మన్యంలో సచివాలయ భవనాలకు మోక్షం

భవన నిర్మాణాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ

- గిరిజన ప్రాంత భవన నిర్మాణాల ఫైల్‌పై తొలి సంతకం
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజనులు
- వైసీపీ పాలనలో మొక్కుబడిగా నిర్మాణాలు
- ఏజెన్సీలో అసంపూర్తిగా 125 భవనాలు

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

వైసీపీ ప్రభుత్వంలో ప్రాధాన్యతా భవనాలుగా పేర్కొన్నప్పటికీ నిధులు సక్రమంగా విడుదల చేయక అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాలకు కూటమి ప్రభుత్వం రాకతో మోక్షం కలగనుంది. గిరిజన ప్రాంతంలోని పంచాయతీ భవన నిర్మాణాలకు సంబంధించిన ఫైల్‌పై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తొలి సంతకం చేశారు. దీంతో ఇన్నాళ్లు అసంపూర్తిగా ఉన్న ఆయా భవనాలకు ఇకపై విముక్తి కలగనుంది.



హుకుంపేట మండలం సంతారిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

మన్యంలో 212 సచివాలయ భవనాలు

విశాఖ ఏజెన్సీ పదకొండు మండలాల పరిధిలో 212 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. 2020లో వాటికి శాశ్వత భవనాలు నిర్మించాలని భావించి, ఉపాధి హామీ పథకంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో రెండంతస్తుల భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఏజెన్సీ వ్యాప్తంగా 212 గ్రామ సచివాలయాలకు భవనాలను నిర్మించేందుకు రూ.84.8 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. కాని ఆయా భవన నిర్మాణాలకు ప్రభుత్వం సక్రమంగా నిధులను విడుదల చేయని పరిస్థితి ఏర్పడింది. దీంతో 2020, 2021 రెండేళ్లు భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. ఆఖరుకు 2022లో కొంత మేరకు నిధులు విడుదల కావడంతో అరకొరగా భవన నిర్మాణాలు పనులు జరిగాయి. ఏజెన్సీలోని 212 గ్రామ సచివాలయాల్లో ప్రస్తుతం 87 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మరో 20 భవనాలు పూర్తయ్యే స్థాయిలో ఉండగా.. 65 తుది దశలో, 28 రెండు శ్లాబుల స్థాయిలో, 10 తొలి స్లాబ్ వేయగా, 2 రూఫ్‌లెవల్‌లో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వమే కొనసాగితే అవన్నీ ఎప్పుడు పూర్తవుతాయో కూడా చెప్పలేని దుస్థితి.

పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ

గిరిజన ప్రాంతంలో సచివాలయాల భవనాల నిర్మాణాలపై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. దీంతో వీటికి మోక్షం కలుగుతాయనే నమ్మకం మన్యం వాసుల్లో కలుగుతున్నది. వాస్తవానికి కేంద్రం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగిస్తే ఈపాటికే ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని సచివాలయ భవనాలు రెండేళ్ల క్రితమే పూర్తయ్యేవి. ఈ సమస్యను గుర్తించిన డిప్యూటీ సీఎం తన తొలి సంతకాన్ని ఏజెన్సీలోని సచివాలయాల భవన నిర్మాణాలకు సంబంధించిన ఫైల్‌పైనే చేశారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి పవన్‌కల్యాణ్ చూపుతున్న చొరవకు ఏజెన్సీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నోరూరిస్తున్న బార్బడోస్ చెర్రీ

గిరిజన ప్రాంతంలో సాగుకు అనుకూలం

- ఉద్యాన పరిశోధన స్థానంలో విరగ్గాసిన మొక్కలు
- పండ్ల రుచి చూసేందుకు ఎగబడుతున్న ప్రాంతీయులు

చింతపల్లి, జూన్ 20: ఉద్యాన పరిశోధన స్థానంలో బార్బడోస్ చెర్రీ మొక్కలు విరగ్గాశాయి. పరిశోధన స్థానంలో పదేళ్లగా ఈ మొక్కలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో ఈ పండ్ల కాశాయి. ఆకర్షణీయంగా చిన్నపాటి యాపిల్స్ మాదిరిగా ఉండే ఈ పండ్లు సందర్శకులను నోరూరిస్తున్నాయి. ఈ పండ్లు పులుపు, తీపి కలిగిన రుచిలో ఉండడంతో తినేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. బార్బడోస్ చెర్రీలను వెస్ట్ ఇండియా చెర్రీ, అనిరోలా అని పిలుస్తారు. అరుదుగా లభించే బార్బడోస్ చెర్రీ మొక్కలు గిరిజన ప్రాంతంలో బాగా పెరుగుతున్నాయి. పండ్ల దిగుబడి అధికంగా ఉంటుంది. ఈ మొక్కలను పరిశోధన స్థానంలో పదేళ్లగా సాగు చేస్తున్నారు. ఈ పండ్లలో పోషక విలువలు పుష్కలంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అరుదుగా లభించే బార్బడోస్ చెర్రీలకు ఉత్తర భారతదేశంలోనూ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ప్రాంతీయంగా మార్కెటింగ్ సదుపాయం పెద్దగా లేకపోయినప్పటికి కుటుంబ సభ్యులు తినడానికి ఆదివాసీలు పెరటిలో రెండు, మూడు మొక్కలు పెంచుకోవడం మంచిదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రతి ఏటా జూన్ నుంచి ఆగస్టు వరకు పండ్ల దిగుబడి ఉంటుంది.



మొక్కలో బార్బడోస్ చెర్రీలు



సాగుకు గిరిజన ప్రాంతం అనుకూలం



గిరిజన ప్రాంతం బార్బడోస్ చెర్రీ సాగుకు అత్యంత అనుకూలం. పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న బార్బడోస్ చెర్రీ మొక్కలు విరగ్గాస్తున్నాయి. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి కాపుకొస్తాయి. గరిష్ఠంగా 30 సంవత్సరాలు పైబడి పండ్ల దిగుబడి ఇస్తుంది. గిరిజన ప్రాంతంలో అరుదైన స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్, అవకడో పంటలను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. సీజన్‌లో ఈ పండ్లను కొనుగోలు చేసుకునేందుకు మైదాన ప్రాంతాల నుంచి వర్తకులు రైతుల వద్దకే వస్తున్నారు. బార్బడోస్ చెర్రీ సాగు రైతులు చేపడితే మార్కెటింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. మైదాన ప్రాంతాల సూపర్‌బజార్లకు సైతం ఎగుమతి చేసుకుని అధిక ధర పొందవచ్చు.

- డాక్టర్ శివకుమార్, అధిపతి, ఉద్యాన పరిశోధన స్థానం

యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం



బార్బడోస్ చెర్రీలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. విటమిన్-సి అధికంగా లభిస్తుంది. పలు రకాల ఖనిజాలు లభిస్తాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ల నొప్పులు కలిగిన వ్యక్తులకు ఆరోగ్యపరంగా మంచి ప్రయోజకరంగా ఉంటుంది. గర్భిణులలో శిశువు అభివృద్ధికి ఎంతగానో దోహపడుతుంది. ఈ పండ్లు తినడం వల్ల మహిళలు ముఖం, శరీరం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. వృద్ధాప్య లక్షణాలు తగ్గుతాయి. నిద్రలేమి సమస్యను నియంత్రిస్తుంది. ప్రతి మానవుడు ఈ పండ్లను ఏడాదికి ఒకసారి తినడం ఆరోగ్యానికి మంచిది.

- బి. దివ్య సుధ, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, కేవీకే హరిపురం

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు

- ఐటీడీఏ పీవో వి. అభిషేక్ హెచ్చరిక
- టీచర్ అవతారం ఎత్తిన పీవో
- 9వ తరగతి విద్యార్థులకు అభిషేక్ బోధన



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

డుంబ్రిగుడ, జూన్ 20: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించనని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. ఉపాధ్యాయులు సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. గురువారం మండలంలోని గుంటసీమ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు రావడం లేదని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.కోగేశ్వరరావు విధులకు గైర్హాజరవడంతో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. సికిల్ సెల్ ఎనిమియా లక్షణాలు ఉన్న విద్యార్థులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తల్లిదండ్రులు సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి తరువాత ఏం చదువుతారని విద్యార్థులను ప్రశ్నించగా.. ఇంటర్మీడియట్ చదువుతామని జవాబుబిచ్చారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులకు జాగ్రఫీ పాఠాన్ని బోధించారు. తర్వాత సాంఘిక శాస్త్రంలో పాఠాలు బోధించారు. పదో తరగతి విద్యార్థుల ఎంత మంది ఉన్నారని టీచర్లను అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా పెట్టాలని ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు తదితరులు ఉన్నారు.

ఆరో తరగతి, ఇంటర్ సీట్లు పెంపునకు ప్రతిపాదనలు

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు



డీడీ కొండలరావు

అరకులోయ, జూన్ 20: పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమోన్నత పాఠశాలల్లో 6వ తరగతి, గురుకుల కళాశాలల్లో ఇంటర్ సీట్లు పెంపునకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ అతిథిగృహంలో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ఆరో తరగతిలో చేరేందుకు అధికంగా విద్యార్థులు వస్తున్నారని, అదేవిధంగా గురుకుల కళాశాలలో ఇంటర్‌కు సీట్ల డిమాండ్ ఉన్నదన్నారు. మండలంలోని లోతేరు, గన్నెల బాల, బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలు, దొరగుడ, భట్టివలస, గొందివలస ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశామన్నారు. లోతేరు బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులకు గాను కేవలం 50 మంది మాత్రమే ఉన్నారని, శనివారం నాటికి 90 శాతం విద్యార్థుల హాజరు ఉండాలని హెచ్‌ఎం, టీచర్లను ఆదేశించామన్నారు. గన్నెల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 230 మంది బాలికలకు గాను 210 మంది ... మిగతా 8వ పేజీలో

గుళి సాగుతో రాగి రెట్టింపు దిగుబడి

ఎకరానికి 14 నుంచి 16 క్వింటాళ్లు..

- ఏపీసీఎన్‌ఎఫ్ ద్వారా రైతులకు ప్రోత్సాహం
- జిల్లాలో ఆరు వేల రైతులతో సాగుకు ప్రణాళిక



నారు సేకరిస్తున్న గిరిజన రైతులు (ఫైల్)



గుళి పద్ధతిలో రాగి నాట్లు వేస్తున్న గిరిజన రైతులు (ఫైల్)

చింతపల్లి, జూన్ 20: గుళి పద్ధతిలో చోడి సాగు చేసుకోవడం వల్ల రెట్టింపు దిగుబడులు సాధించవచ్చునని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ పద్ధతిలో రాగి సాగు చేయడం ద్వారా సాధారణం కంటే రెండు రెట్లు అధికంగా ఎకరాకు 14 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు సుదీర్ఘకాలంగా సంప్రదాయంగా రాగి (చోడి) సాగు చేపడుతున్నారు. కాలక్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్ పరిధిలో గిరిజన రైతులు 18,176 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వం పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్‌ఎఫ్)లో భాగంగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించింది. తాజాగా ఇదే కార్యక్రమాన్ని ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయం) ద్వారా వ్యవసాయ శాఖ కొనసాగిస్తున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ రైతులకు గుళి పద్ధతిలో రాగి సాగును వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తున్నది. అలాగే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గుళి రాగి సాగును శ్రీకాకుళం, విజయనగరం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విస్తరింపజేయాలని కార్యాచరణ ప్రారంభించారు.



సైకిల్ వీడర్‌తో కలుపు తొలగిస్తున్న రైతు (ఫైల్)

నారు మడి తయారీ..

గుళి సాగుకు తొలుత రాగి నారుమడి తయారు చేసుకోవాలి. వెదజల్లే పద్ధతిలో ఎకరానికి పది కిలోల విత్తనం అవసరం. గుళి పద్ధతిలో ఎకరానికి కేవలం 300 గ్రాముల విత్తనం సరిపోతుంది. రైతులు తొలుత మీటరు వెడల్పు, ఐదు మీటర్లు పొడవు గల నారుమడులను సిద్ధం చేసుకోవాలి. నేలను మెత్తగా చేసుకున్న తరువాత ఘనజీవామృతం (100కిలోల పశువుల పేడ, ఐదు కిలోల మూత్రం, రెండు కిలోల శగనపిండి, ఒక కిలో పుట్టమట్టిగాని, గట్టుమట్టిగాని కలుపుకుని వారం రోజులు నీడలో ... మిగతా 8వ పేజీలో

గుళి పద్ధతిలో అధిక దిగుబడులు



గుళి పద్ధతిలో రాగి రెట్టింపు దిగుబడులు వస్తున్నాయి. సాధారణ పద్ధతిలో సాగు చేసిన రైతులకు 5,6 క్వింటాళ్ల దిగుబడులు రావడం కష్టంగా ఉంది. గుళి పద్ధతిలో ఎకరానికి 13 క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తుంది. చిన్నగెడ్డ గ్రామంలో మర్రి మంగ్లు గుళి రాగి పద్ధతిలో సాగు చేపట్టి ఎకరానికి 14క్వింటాళ్ల దిగుబడి సాధించారు.

- కంటా జాహ్నవి, వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు, చింతపల్లి

జిల్లాలో 6 వేల మంది రైతులతో సాగు



ఈ ఏడాది జిల్లాలో 6 వేల మంది రైతులతో గుళి పద్ధతిలో రాగి సాగు చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రతి రైతు 50 సెంట్లు నుంచి ఎకరం విస్తీర్ణంలో సాగు చేపట్టే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే రైతులను ఎంపిక చేశాం. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది నారు మడి నుంచి పంట కోతదశ వరకు సాంకేతిక సహకారం అందిస్తారు.

- బి.కుమార్ బాబు, ఎన్ఎఫ్ఏ, ఏపీసీఎన్ఎఫ్, పాడేరు



ఘనంగా రెవెన్యూ దినోత్సవం

రెవెన్యూ దినోత్సవం పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత విశ్రాంత రెవెన్యూ అధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పీపీఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

-వార్త 8వ పేజీలో..

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు

మూడేళ్లుగా చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం

- ప్రభుత్వం మారడంతో ఈ ఏడాది నుంచి మళ్లీ పంపిణీ
- వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 22 వేల విద్యార్థులకు లబ్ధి

విశాఖపట్నం, జూన్ 20: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడానికి విద్యా శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ చర్యలు చేపట్టారు. వచ్చే నెల 15వ తేదీ నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీనివల్ల ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 22 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

వైసీపీ ప్రభుత్వం గడచిన మూడు విద్యా సంవత్సరాల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ నిలిపివేసింది. విద్యా వ్యవస్థలో విప్లవం తీసుకొస్తామన్న వైసీపీ పాలకులు కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించలేకపోయారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది 2008 నాటి 'పుస్తక ప్రసాదం' అనే పాత పథకాన్ని పునరుద్ధరించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కోరింది. ప్రభుత్వ కోర్కె మేరకు 2019-20 విద్యాసంవత్సరానికి టీటీడీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసింది. ఆ తర్వాత ఏడాది నుంచి పుస్తకాల పంపిణీ నిలిపివేసింది. దీంతో గత మూడేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాఠ్యపుస్తకాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని కళాశాలల అధ్యాపకులు ఓల్డ్ స్టూడెంట్స్ వద్ద పుస్తకాలు సేకరించి పేద విద్యార్థులకు పంచిపెట్టారు. మరికొందరు తమ వద్ద పాఠ్య పుస్తకాలతో ... మిగతా 8వ పేజీలో



ప్యాలెస్ కాదు.. వైసీపీ కార్యాలయం!

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రంలో అక్రమ భవనాలు ఉండడానికి వీల్లేదు. అలాంటి వాటిని మా ప్రభుత్వం ఉపేక్షించదు. ప్రజా వేదిక కూడా అలాంటిదే కాబట్టి కూల్చేస్తున్నాం' అంటూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పుకొన్నారు. ఆ హడావుడి అంతా ప్రజావేదిక కూల్చివేత వరకే.. ఆ తరువాత ఏ అనధికార నిర్మాణాన్నీ తొలగించింది లేదు. అంతేకాదు ఆయన పార్టీ కూడా అనుమతులు లేకుండా అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టింది. ఈ జాబితాలో విశాఖ నగరంలో వైసీపీ కార్యాలయం కోసం చేపట్టిన భవనం కూడా ఉంది.

ఆ పార్టీ విశాఖ నేతల బరితెగింపు

- ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- ఎకరా రూ.50 కోట్ల విలువైన భూమికి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున చెల్లింపు
- 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తూ ఉత్తర్వులు
- దీనిపై అప్పట్లోనే వెల్లువెత్తిన విమర్శలు
- అధికార పార్టీ కావడంతో నోరెత్తని అధికారులు
- జీవీఎంసీ అనుమతి లేకుండానే భవన నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో యంత్రాంగంలోనూ, నేతల్లోనూ ఆందోళన
- తాజాగా ప్లాన్ అనుమతికి దరఖాస్తు


విశాఖ నగర పరిధిలో ఎండాడ సర్వే నంబర్ 175/4లో ప్యాలెస్ మాదిరిగా నిర్మించిన వైసీపీ కార్యాలయం

చేతిలో అధికారం ఉంది కదా అని వైసీపీ నేతలు విశాఖ ఐటీ సెజ్ సమీపంలో అత్యంత విలువైన రెండెకరాల భూమిని లీజు పేరుతో కారుచౌకగా దక్కించుకున్నారు. అందులో జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే ప్యాలెస్‌ను తలదన్నేలా పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మించేశారు. అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కావడంతో అధికారులు కూడా నోరెత్తే సాహసం చేయలేకపోయారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అక్రమ భవన నిర్మాణం అంశం ఎక్కడ తమ పీకకు చుట్టుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా 2022 మే 16న పీఎంపాలెం సమీపాన ఎస్‌వీవీ లా కాలేజీ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే రోడ్డును ఆనుకుని పనోరమ హిల్స్ సమీపంలో ఎండాడ సర్వే నంబర్ 175/4లో రెండెకరాల ప్రభుత్వ భూమిని పార్టీ కార్యాలయం నిర్మాణానికి కేటాయించుకున్నారు. ప్రస్తుతం అక్కడ భూమి ధర ఎకరా రూ.50 కోట్లు పైగా పలుకుతుంది. అంటే రెండు ఎకరాల భూమి విలువ రూ.వంద కోట్లు. ఆ భూమిని ఏడాదికి (ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి) కేవలం రూ.రెండు వేలు చెల్లించేలా 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఐదేళ్ల లీజు మొత్తం (రూ.పది వేలు) ముందుగానే చెల్లించాలని, తర్వాత ప్రతి ఐదేళ్లకు లీజు మొత్తాన్ని పది శాతం చొప్పున మాత్రమే పెంచేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన భూమిని కారుచౌకగా అధికార పార్టీకి కట్టబెట్టడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. జీవీఎంసీ నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్యాలెస్‌ను తలపించేలా ఆ స్థలంలో భారీ భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉండగానే గత ఏడాది సెప్టెంబరు రెండో తేదీన పార్టీ కార్యాలయాన్ని హఠాత్తుగా ప్రారంభించేశారు. ఒకవైపు భవన నిర్మాణపనులు జరుగుతుంటే మరోవైపు అక్కడే పార్టీ సమావేశాలు నిర్వహించేవారు. ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకూ పార్టీ నేతలు, కార్యకర్తలతో కార్యాలయం కళకళలాడుతుండేది. ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత కార్యాలయం ముఖం చూసేవారు లేకపోవడంతో ప్రస్తుతం బోసిపోతోంది.

ప్లాన్ లేకుండానే భవన నిర్మాణం

జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే వైసీపీ నేతలు పార్టీ కార్యాలయం కోసం ప్యాలెస్ మాదిరిగా భారీ భవంతిని నిర్మించేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎవరైనా చిన్న ఇల్లు కట్టుకున్నా ప్లాన్ తప్పనిసరి అని బెదిరించే టౌన్ ప్లానింగ్ అధికారులు.. ఎలాంటి ప్లాన్ లేకుండా భారీ భవన నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోకపోవడం విశేషం. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం వైసీపీ నేతలు మీసాల వెంకట సుబ్రసాయిశరణ్ అనే లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) ద్వారా ప్లాన్‌కు గత ఏడాది జనవరి 12న దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫీజు కింద రూ.10 వేలు చెల్లించి వదిలేశారు. లీజు భూమిలో నిర్మాణం కావడంతో గ్రామ పంచాయతీ చార్జీల కింద రూ.4.44 లక్షలు, పర్మిట్ ఫీజు కింద రూ.10.44 లక్షలు, గ్రీన్ ఫీజు కింద రూ.33 వేలు, డీపీఎంఎస్ యూజర్ చార్జీలు కింద రూ.500, లేబర్ సెస్ చార్జీల కింద రూ.1.54 లక్షలు.. మొత్తం సుమారు రూ.17 లక్షలు జీవీఎంసీకి చెల్లించాలి. ఆ ఫీజులన్నింటినీ చెల్లించిన తర్వాత భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్, డ్రాయింగ్‌ను ఎల్‌టీపీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డాక్యుమెంట్లు అన్నీ సరైనవేనని ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ అయిన తర్వాత బిల్డింగ్ ప్లాన్ నంబర్ జనరేట్ అవుతుంది. తర్వాత ప్లాన్ అప్లికేషన్ సంబంధిత వార్డు సచివాలయంలోని వార్డు ప్లానింగ్ సెక్రటరీ పరిశీలనకు వెళుతుంది. ప్లానింగ్ సెక్రటరీ భవన నిర్మాణం ప్రతిపాదిత స్థలానికి వెళ్లి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లలో ఉన్నట్టుగానే భూమి కొలతలు, రోడ్డు కనెక్టవిటీ ఉనదీ లేనిదీ పరిశీలిస్తారు. సక్రమంగా ఉన్నట్టు నిర్ధారిస్తే తనపై అధికారికి, అలా కమిషనర్ వరకూ అప్లికేషన్ వెళ్లి అక్కడ ప్లాన్ అప్రూవల్ జరుగుతుంది. కానీ వైసీపీ కార్యాలయం ప్లాన్ విషయానికి వస్తే కేవలం అప్లికేషన్ చార్జీల కింద గత ఏడాది జనవరి 12న రూ.పది వేలు చెల్లించి వదిలేశారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో ఎలాంటి ప్లాన్ లేకుండానే అడ్డగోలుగా భవన నిర్మాణం పూర్తిచేసేశారు. అధికారం కోల్పోవడంతో ఎక్కడ ఇబ్బందులు వస్తాయోనని భయంతో ఇప్పుడు ప్లాన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. దీని కోసం ఈ నెల 17న గ్రామ పంచాయతీ చార్జీలు కింద కట్టాల్సిన రూ.4.44 లక్షలు చెల్లించారు. మిగిలిన ఫీజులను మాత్రం ఇంకా చెల్లించకపోవడంతో ప్లాన్ అప్లికేషన్ ఇంకా ఎల్‌టీపీ లాగిన్ నుంచి జీవీఎంసీ లాగిన్(డీపీఎంఎస్)కు చేరలేదు.

ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ప్లాన్ అనుమతి లేకుండానే వైసీపీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తిచేసేయడంతో దీనిపై జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఆసక్తి నెలకొంది. భవన నిర్మాణానికి ముందే ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్లాన్ అప్రూవ్ అయిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలి. అలా కాకుండా ప్లాన్ జారీ కాకుండానే భవన నిర్మాణం చేపట్టినా, పూర్తిచేసినా సరే అక్రమ నిర్మాణంగానే పరిగణిస్తారు. తీసుకున్న ప్లాన్‌కు చిన్నపాటి ఉల్లంఘనలతో నిర్మాణాలు చేశారని ఆరోపిస్తూ అనేక భవనాలను కూలగొట్టేసిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు.. ఎలాంటి ప్లాన్ లేకుండానే నిర్మాణం పూర్తిచేసిన వైసీపీ భవనం విషయంలో ఎలా ముందుకువెళతారో చూడాలి.

క్రైం... crime news

మద్యం మత్తులో అన్నదమ్ముల ఘర్షణ

- ఒకరి మృతి
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- పోలీసులు కేసు నమోదు

పాడేరురూరల్, జూన్ 20: మద్యం మత్తులో అన్నదమ్ముల (చిన్నాన్న, పెదనాన్న) పిల్లలు మధ్య జరిగిన ఘర్షణలో దాగరి సూరిబాబు (63) మృతి చెందిన ఘటన మండలంలోని మినుములూరులో బుధవారం చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని మినుములూరులో దాగరి సూరిబాబు, దాగరి నరసింహమూర్తి చిన్నాన్న, పెదనాన్న పిల్లలు. వీరు నిత్యం మద్యం సేవించి చిన్న చిన్న విషయాలపై తరచూ ఘర్షణ పడుతూనే ఉంటారు. అదే విధంగా ఈనెల 18వ తేదీ మంగళవారం రాత్రి వీరిద్దరూ మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. బుధవారం ఉదయం చూసే సరికి సూరిబాబు మృతి చెందాడు. రాత్రి జరిగిన ఘర్షణలో కొట్టడం వల్లే మృతి చెందాడంటూ సూరిబాబు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు నరసింహమూర్తి ఇంటి వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం సాయంత్రం సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. గురువారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని సూరిబాబు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయమై సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్ మాట్లాడుతూ..సూరిబాబుది హత్య కాదని, సాధారణ మరణంగానే కనిపిస్తుందన్నారు. కేసు నమోదు చేసి గ్రామంలో దర్యాప్తు నిర్వహించామని ఆయన తెలిపారు.

జిల్లాకు 850 పశువుల గోకులం షెడ్లు మంజూరు

- పశుసంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నరసింహ


మాట్లాడుతున్న డీడీ నరసింహ

కోటవురట్ల, జూన్ 20: జిల్లాకు 850 పశువుల గోకులాల షెడ్లు మంజూరు అయినట్టు పశుసంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నరసింహ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు చెందిన పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులాల షెడ్లు పశువులు పెంపకందారులకు మాత్రమే మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రతి మండలానికి 40 నుంచి 45 వరకు గోకులాల షెడ్లు కేటాయిస్తామన్నారు. ఈ సీజన్‌లో అధికంగా పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు సోకే ప్రమాదం వుందన్నారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా వ్యాక్సిన్లు వేయాలని సూచించారు. సమావేశంలో ఏడీ సింహాద్రప్పుడు, వైద్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

చోడవరం, జూన్ 20: పట్టణంలో ఈ నెల 22, 23 తేదీల్లో సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకన్న గురువారం తెలిపారు. చోడవరంలో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులలో ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యల పరిష్కారం, ఇతర సమస్యలపై పోరాటాలకు సీపీఎం కార్యకర్తలు ప్రణాళిక రూపొందించనున్నారన్నారు.

నీట్‌ను మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ర్యాలీ


ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై నిరసన ర్యాలీ చేపట్టిన ఎస్ఎఫ్ఐ నేతలు

ఎలమంచిలి, జూన్ 20: దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరుతూ శనివారం ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. బాలాజీ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. రాష్ట్రాల హక్కులు, స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్నారు. పరీక్షల నిర్వహణ నుంచి ఎన్‌టీఏను తప్పించాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేందుకు పరీక్ష మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు కేశవ, శ్రీను, అప్పలరాజు విజయ్, గణేష్ పాల్గొన్నారు.

యోగా ఆకారంలో విద్యార్థుల వినూత్న విన్యాసం


యోగా గుర్తు విన్యాసాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం, జూన్ 20: మండలంలోని గుడివాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం యోగా ఆకారంలో వినూత్న విన్యాసాన్ని ప్రదర్శించారు. శుక్రవారం జరిగే ఇంటర్నేషనల్ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్‌చార్జి హెచ్‌ఎం మహేశ్వరి ఆధ్వర్యంలో పాఠశాల పీడీ కందూరు రాజు యోగా గుర్తు ఆకారంలో విద్యార్థులతో వినూత్నంగా విన్యాసాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, పద్మావతి, భవానీ పాల్గొన్నారు.

నేడు పాఠశాలల్లో సూర్య నమస్కారాలు

కొత్తూరు, జూన్ 20: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వాటికి సంబంధించిన ఫొటోలు వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులందరూ దిగువ తరగతులైన 1 నుంచి 6 వరకు విద్యార్థులకు మంచి పునాదిని వేసి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా బోధన చేయాలని పేర్కొన్నారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, జూన్ 20: దంతెవాడ, కామలూరు స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖ-కిరండోల్ ఎక్స్‌ప్రెస్ (18514) ఈనెల 21 నుంచి 25 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18513) ఈనెల 22 నుంచి 26 వరకు దంతెవాడ నుంచి విశాఖకు రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

అచ్యుతాపురానికి మంచి రోజులు

- ఐదేళ్ల వైసీపీ పాలనలో క్షీణించిన పారిశుధ్యం
- పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా పట్టించుకోని పాలకులు
- కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే 'సుందరపు' ప్రత్యేక దృష్టి
- అద్దంలా తీర్చిదిద్దాలన్న ఆదేశాలతో అధికారుల్లో కదలిక

అచ్యుతాపురం, జూన్ 20 : పారిశ్రామికంగా శరవేగంతో అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో పారిశుధ్యం క్షీణించింది. గడచిన ఐదేళ్లలో ఇక్కడ ఈ సమస్యను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఎటుచూసినా చెత్తాచెదారం, ఏ కాలువ చూసినా మురుగుతో దర్శనమిచ్చేవి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలమంచిలి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సుందరపు విజయ కుమార్ తొలుత ఇక్కడి పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా విభాగాల్లో కదలి ఏర్పడి, పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. అచ్యుతాపురం రెండు పంచాయతీల పరిధిలో ఉంది. అచ్యుతాపురం జంక్షన్‌తో పాటు పూడిమడక రోడ్డులో గల రామాలయం వరకు మోసయ్యపేట పంచాయతీ పరిధిలో ఉండగా, అక్కడ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో ఉంది. అయితే గడచిన ఐదేళ్లలో అచ్యుతాపురం, మోసయ్యపేట పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు జరగలేదు. ముఖ్యంగా ఇక్కడ డ్రైనేజీ ప్రధాన సమస్యగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు అచ్యుతాపురం జంక్షన్ రోడ్లగుండా పారుతుంది. పంచాయతీలకు నిధుల కొరత కారణంగా గత వైసీపీ పాలనలో పారిశుధ్య సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలు కావడం, కూటమి అధికారంలోకి రావడంతో ఈ ప్రాంత ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తించాయి. అందుకు అనుగుణంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముందుగా అచ్యుతాపురం జంక్షన్‌పై దృష్టి సారించారు. కాలువలు అధ్వానంగా ఉండంతో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు యుద్ధప్రాతిపదికన యంత్ర సహాయంతో పనులు ప్రారంభించారు. ముందుగా కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు.


పూడిమడక రోడ్డులోని కాలువల్లో చెత్తను తొలగిస్తున్న దృశ్యం


ఎలమంచిలి రోడ్డులో డ్రైనేజీలపై వేసిన పలకలను తొలగిస్తున్న దృశ్యం

కాలువలపై ఉన్న సిమెంటు పలకలను తొలగించి ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడికను తీయిస్తున్నారు. అలాగే కాలువలను వెడల్పు చేస్తున్నారు. అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యేక ఆర్థిక మండల (సెజ్) ముఖ ద్వారమైన అచ్యుతాపురం జంక్షన్ గురించి వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. సెజ్‌లో కర్మాగారాలకు ఎవరు వెళ్లాలన్నా అచ్యుతాపురం జంక్షన్ మీదుగానే చేరుకోవాల్సి ఉంటుంద న్నారు. కర్మాగారాలకు విదేశీయులు ఎక్కువగా వస్తున్న తరుణంగా ఇకపై వారు సైతం మెచ్చేలా ఈ జంక్షన్ తీర్చిదిద్దుతామని వివరించారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'


విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూన్ 20: నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూళ్లతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల కోసం అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.ఫణేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి భారీగా వసూళ్లకు ప్రైవేటు యాజమాన్యాలు పాల్పడుతున్నాయన్నారు. కనీసం ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ నాయకులు బి. బాబ్జి, జగదీష్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

25న సీజ్ చేసిన రేషన్ బియ్యం వేలం

ఎలమంచిలి, జూన్ 20: మండలంలో వివిధ 6 ఏ కేసులలో సీజ్ చేసిన 15.224 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఈనెల 25వ తేదీన ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం పాట నిర్వహిస్తామని తహసీల్దార్ అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లి బియ్యం నిల్వను పరిశీలించుకోవచ్చునన్నారు. సంబంధిత వివరాలు జిల్లా పౌరసరఫరాల అధికారి, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ్యాల్లోని నోటీసు బోర్డులో ఉంచడమైనదన్నారు. మరిన్ని వివరాల కోసం ఎలమంచిలి సివిల్ సప్లయ్ ఉప తహసీల్దారును 9493357555లో సంప్రదించాలని కోరారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కోరిబిల్లి


విజయవాడలో మంత్రి లోకేశ్‌ను కలిసిన కోరిబిల్లి లోవరాజు

ఎస్.రాయవరం, జూన్ 20: మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడింట్ కోరిబిల్లి లోవరాజు గురువారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వీఆర్ఏల సమస్యలను సంఘం తరుపున మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వీఆర్ఏల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చినట్టు లోవరాజు తెలిపారు.

మంత్రి 'నిమ్మల'ను కలిసిన సుందరపు


నిమ్మల రామానాయుడుతో విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 20 : నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని సచివాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గంలో గల శారదా నది, కొండకర్ల ఆవ తదితరాలపై చర్చించారు

తుమ్మపాలలో విత్తనాల పంపిణీ

తుమ్మపాల, జూన్ 20: రాయితీపై విత్తనాల పంపిణీని గురువారం ఇక్కడ ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి రంగాచారి, నాయకులు కర్రి బాబి, సత్యవతి, తట్టా పెంటయ్యనాయుడు, బొడ్డపాటి రామ్‌కుమార్, పీలా విశ్వేశ్వరరావు, రాపేటి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

దేవస్థానం భూముల కౌలుకు వేలం పాట

రోలుగుంట, జూన్ 20: మండలంలోని కంచుగుమ్మల గ్రామంలోని సత్యనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన భూములను మూడేళ్లకు కౌలు ఇవ్వడానికి గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. సర్వే నంబరు 7లోని 5.10 ఎకరాల భూమి, సర్వే నంబరు 224/1లోని 3.14 ఎకరాల భూమి కౌలును వేలంలో ఇద్దరు దక్కించుకున్నట్టు దేవస్థానం ఈవో కిరణ్మయి తెలిపారు. కాగా సర్వే నంబర్లు 18, 21/2లలో గల భూముల వేలంపాటకు పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది.

యోగాతో బహుళ ప్రయోజనాలు


నీటిలో యోగాసనాలు వేస్తున్న నరసింగరావు

తుమ్మపాల, జూన్ 20: యోగాతో బహుళ ప్రయోజనాలున్నాయని శ్రీకృష్ణ యోగా సెంటర్ గురువు బుదిరెడ్డి నరసింగరావు పేర్కొన్నారు. యోగా చేయడం ద్వారా జీవన విధానాల్లో మార్పు, వ్యాధి నిరోధక, ఆరోగ్య అభివృద్ధి చెందుతుందన్నారు. యోగా సాధనతో ఆయుష్షు పెంచుకోవచ్చునన్నారు. తుమ్మపాలలో విద్యార్థులకు ఉచితంగా యోగా, స్విమ్మింగ్ నేర్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలు నాశనం

- ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.జైసింహా చౌదరి

అనకాపల్లి టౌన్, జూన్ 20 : యువత మాదక ద్రవ్యాల జోలికి పోయి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.జైసింహా చౌదరి కోరారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై స్థానిక శ్రీకన్య జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శైలజారాణి, ఇన్‌స్పెక్టర్లు డి.అనిల్‌కుమార్, జి.శ్రీనివాసరావులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పరశురామ బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లి టౌన్, జూన్ 20: పరశురామ పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షులుగా భోగలింగేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు పేరూరి చిన్నిస్వామిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షులుగా చుండూరి సత్యనారాయణమూర్తి, గౌరవ సలహాదారులుగా రాంపల్లి అన్నపూర్ణ శర్మ, ఉపాధ్యక్షులుగా చావలి వెంకట రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా తమ్మిరాజు శ్యామ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా వాహినీపతి సంతోష్‌కుమార్, కోశాధికారిగా తణికెళ్ల రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాచకొండ రవికుమార్, అధికార ప్రతినిధిగా గంటి రవికుమార్‌తో పాటు తొమ్మిది మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

సీడ్ డ్రిల్ ద్వారా వరి విత్తే పద్ధతిపై అవగాహన

ఎలమంచిలి, జూన్ 20: మునిసిపాలిటీలోని రామారాయుడుపాలెంలో గురువారం రైతులకు సీడ్ డ్రిల్ ద్వారా వరి విత్తే పద్ధతిపై వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో ఎకరానికి 20 కేజీల విత్తనం అవసరం అవుతుందని, విత్తనంతో పాటు ఎరువు కూడా ఒకేసారి కలిపి వేయవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ'లో పనిచేయడం అదృష్టంగా భావించాలి : కలెక్టర్

» కలెక్టరేట్‌లో ఘనంగా రెవెన్యూ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజలకు సేవలందించే రెవెన్యూ శాఖలో పని చేయడం అదృష్టంగా భావించాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. రెవెన్యూ దినోత్సవం పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెవెన్యూ శాఖ పనితీరు అమోఘమని ఆమె కొనియాడారు. ఎన్నికల విధుల్లో మినహాయింపును అనేక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కోరారని, కాని రెవెన్యూ శాఖలో ఏ ఒక్కరూ మినహాయింపు కోకుండా పని చేశారన్నారు. అలాగే స్థానిక తాహసీల్దార్ కల్యాణచక్రవర్తి ఎన్నికల సమయంలో అనారోగ్యానికి గురైనా కనీసం సెలవు తీసుకోకుండా పని చేశారని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అందరి సమన్వయ కృషితో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సార్వత్రి ఎన్నికలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రజలకు 517 సేవలను రెవెన్యూ శాఖ ద్వారా అందుతున్నాయని, మనిషి పుట్టుక నుంచి మరణం వరకు రెవెన్యూ సేవలు అందుతాయన్నారు. ఆయా సేవలను మరింత మెరుగ్గా అందించి జిల్లాకు మరింత పేరుతీసుకురావాలని కలెక్టర్ విజయసునీత కోరారు.

విశ్రాంత అధికారులకు సత్కారం

రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ఆ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన అధికారులను కలెక్టర్ విజయసునీత, తదితరులు సత్కరించారు. విశ్రాంత ఎస్‌డీసీ టి.అప్పారావునాయుడు,విశ్రాంత డీటీ ఈశ్వరరావు, విశ్రాంత ఆర్ఐ శ్రీహరిలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, భవానీ, కలెక్టరేట్ తాహసీల్దార్ అరుణకుమారి, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రెవెన్యూ దినోత్సవ నిర్వహణ మంచి ఆలోచన'

పెదబయలు, జూన్ 20 : రెవెన్యూ ఉద్యోగుల దినోత్సవం జరుపుకోవడంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి నిర్ణయమని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాయంలో రెవెన్యూ ఉద్యోగుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో అన్ని శాఖల కన్న రెవెన్యూ శాక కీలమని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, ఎంఈవో కృష్ణమూర్తి, డీటీ రంగారావు, వైస్ ఎంపీపీ రాజుబాబు, ఆర్ఐ సింహాచలం పాల్గొన్నారు.

అరకు ప్రాంతీయ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

» 8 కిలోల కణితి తొలగింపు



రోగి పొట్టలో నుంచి డాక్టర్ రాము వైద్య బృందం తొలగించిన కణితి

అరకులోయ, జూన్ 20 : అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో గురువారం ఆస్పత్రి ఇన్‌చార్జి, జనరల్ సర్జన్ డాక్టర్ ఎల్.రాము ఆధ్వర్యంలో వైద్యుల బృందం అరుదైన శస్త్ర కిత్సను నిర్వహించారు. విశాఖ కేజీహెచ్‌లో నిర్వహించాల్సిన ఈ చికిత్సను ఆస్పత్రి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జనరల్ సర్జన్ డాక్టర్ రాము ప్రత్యేక చొరవ తీసుకొని డాక్టర్ అప్పారావు అనస్థీయన్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ పావనిలతో కలిసి విజయవంతంగా చేపట్టారు. దిబ్బవలస గ్రామానికి చెందిన పోడిపల్లి తిమ్ము(45)కు పొట్టలో ఉన్న 8 కిలోల కణితిని శస్త్రచికిత్స చేసి తొలగించారు. రెండు గంటల పాటు శస్త్రచికిత్స చేపట్టారు. కాగా, వారం రోజుల కిందట కడుపు నొప్పి, పొట్ట ఉబ్బరంతో తిమ్ము ఆస్పత్రికి వచ్చాడని, పరీక్షించి పొట్టలో కణితి ఉన్నట్టు గుర్తించామని డాక్టర్ రాము తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందిన తిమ్ము ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పారు. ఈ ఆస్పత్రిలో మేజర్ ఆపరేషన్ చేయడం ఇదే ప్రథమమని తెలిపారు. తనతోపాటు ఆపరేషన్‌లో పాల్గొన్న వైద్యబృందంతో పాటు సిబ్బంది రాంబాబు, సావిత్రి, ఉషాలకు డాక్టర్ రాము అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రస్తచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందానికి ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు

» బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు

నర్సీపట్నం, జూన్ 20 : ఒకేషనల్ కళాశాల విద్యార్థినిపై ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ కాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకరపాలెం మండలానికి చెందిన ఓ వివాహిత నర్సీపట్నం డీఎంకే ఒకేషనల్ కళాశాలలో వెటర్నరీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురువారం మధ్యాహ్నం కళాశాల ప్రిన్సిపాల్ సోరీ ఉరఫ్ మునలయ్య(35) ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రిన్సిపాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి పట్టణ ఎస్ఐ సుధాకరరావు దర్యాప్తుచేస్తున్నారు.

ప్రారంభానికి వసతి గృహం సిద్ధం

» రూ.1.97 కోట్లతో జీప్లస్ వన్ భవనంగా నిర్మాణం
» 170 మంది వసతికి అవకాశం
» అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు



నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వసతిగృహం ఇదే..

అరకులోయ, జూన్ 20 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన అనుబంధ వసతిగృహ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ భవనం మంజూరైంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులంతా డేస్ కాలర్స్ ఉంటారు. అయితే డేస్‌కాలర్స్‌గా వచ్చే విద్యార్థుల్లో అరకులోయకు చెందిన వారు ఉంటారు. వీరే కాకుండా పరిసర ప్రాంతాలకు చెందిన వారు కూడా ఇక్కడ విద్యాభ్యాసం చేస్తుంటారు. ప్రతీ రోజూ ఇళ్లకు వెళ్లి రాకపోకలు సాగించకుండా అటువంటి విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేకంగా వసతిగృహాన్ని ఏర్పాటు చేసింది. ఈ హైస్కూల్‌కు అనుబంధంగా నిర్మించిన వసతిగృహాన్ని ఆర్ఎంఎస్ఎ గ్రాంటు నుంచి సుమారు రూ.1.97 కోట్లతో జీప్లస్ వన్ భవనంగా నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో పది గదులతో పాటు డైనింగ్ కం కిచెన్, టాయ్‌లెట్స్, మొదటి అంతస్తులో ఏడు గదులు నిర్మించారు. ఈ వసతి గృహంలో సుమారు 170 మంది విద్యార్థులు వసతి పొందే అవకాశం ఉంది.

ఈ అనుబంధ వసతిగృహం అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు వసతిగృహంలో ఉండే విధంగా, ఉన్న విద్యార్థులకు మెస్ సౌకర్యం ఇతర సౌకర్యాలు, వార్డెన్‌ను ప్రత్యేకంగా నియమించాల్సి ఉంది. ఇందుకు తగినట్టుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అమలు చేస్తేనే హైస్కూల్‌లో చదువుకునే విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. గిరిజన ప్రాంతంలో ఉన్న ఆశ్రమోన్నత పాఠశాలలన్నీ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ హైస్కూల్‌లో నిర్మించిన అనుబంధ వసతిగృహం ఏ శాఖ పర్యవేక్షణలోకి తీసుకువస్తారో తెలియాల్సి ఉంది. ఈ భవన నిర్మాణం పూర్తి చేసినట్టు హైస్కూల్ హెచ్‌ఎంకు సమాచారం ఇవ్వడం జరిగిందని పనులను పర్యవేక్షించిన డీఈఈ సన్యాసయ్య తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించండి

పలు ఆస్పత్రుల్లోని పారిశుధ్య కార్మికుల ధర్నా

అరకులోయ, జూన్ 20 : పాడేరు ఐటీడీఏ పరిధిలోని పాడేరు, అరకులోయ,ముంచంగిపుట్టు ఆస్పత్రుల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన నాలుగు నెలల వేతనాలు తక్షణం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అల్లూరి జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి ముందు కార్మికులు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నెలల తరబడి వేతనాలు చెల్లించకుంటే ఎలా బతకాలని కార్మికులు ప్రశ్నించారు. కాంట్రాక్టర్ స్పందించి బకాయి వేతనాలతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు చెల్లించకుంటే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘు, ఏరియా ఆస్పత్రిలో పని చేసే పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చింతపల్లిలో రెవెన్యూ దినోత్సవం

చింతపల్లి, జూన్ 20 : రెవెన్యూ ఉద్యోగులు ప్రజా ప్రయోజనాల కోసం బాధ్యతాయుతంగా పని చేయాలని స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తొలుత వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులతో కలిసి తహసీల్దార్ కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వీర సాయిబాబు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కొర్ర పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, నాగభూషణం, వర్తకం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, పదవి విరమణ పొందిన రెవెన్యూ ఉద్యోగులు సన్యాసిరావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు

... 5వ పేజీ తరువాయి

క్లాసులు చెప్పి, నోట్స్ రాయించి మూడేళ్లు మేనేజ్ చేశారు.

మంత్రి ఆదేశాలతో 22 వేల మందికి లబ్ది

జూలై 15 నాటికి విద్యార్థులందరికీ పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించడంతో ఉమ్మడి జిల్లా వృత్తివిద్యాశాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 39 ప్రభుత్వ, ఎయిడెడ్, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం 11,654 మంది చదువుతున్నారు. ఇప్పటివరకూ ప్రథమ సంవత్సరంలో 8,500 మంది విద్యార్థులు చేరారు. నెలాఖరులోగా మరో మూడు వేల మంది చేరే అవకాశం ఉంది. ఈ చేరికల ఆధారంగా ఆంగ్లం, తెలుగు మీడియం సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 22 వేల మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రింట్ చేయడానికి జాబితా రూపొందించి ఇంటర్ బోర్డుకు పంపించారు.

బడి ఈడు పిల్లలకు నిర్బంధ విద్యపై పటిష్ట చర్యలు

» అల్లూరి జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు
» కొయ్యూరు హైస్కూలు ఆకస్మిక తనిఖీ
» నలుగురు ఉపాధ్యాయులకు మెమోలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

కొయ్యూరు, జూన్ 20 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరు నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలకు నిర్బంధ పాఠశాల విద్య తప్పనిసరి అమలయ్యేలా పటిష్ట చర్యలు తీసుకొంటున్నట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. గురువారం మండలంలోని కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ బాలబాలికలందరూ బడికి వెళ్ళేలా ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే ఉద్దేశంతో 'నేను బడికి పోతా' ప్రారంభించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 2527 ప్రాథమిక, 370 ప్రాథమికోన్నత పాఠశాలల పరిధిలో గల 6-14 సంవత్సరాలలోపు వివిధ కారణాలతో చదువు మధ్యలో నిలిపివేసిన వారిని గుర్తించి వారికి నిర్బంధ పాఠశాల విద్య అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇటువంటి వారు సుమారుగా 30 వేలు దాటి ఉంటారనే అంచనా ఉందని వారందరినీ బడిలో చేర్పించేందుకు వీలుగా వారి తల్లితండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయటం, బడిలో అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించటం, మండల, గ్రామ స్థాయిల్లో ఇందుకు నిర్దేశించిన సభ్యులతో ర్యాలీలు, సభలు, అవగాహన సదస్సులు నిర్వహించి పిల్లలను గుర్తింపు ప్రక్రియ చేపట్టామన్నారు. ఇందుకోసం జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశామని డీఈవో తెలిపారు. ఇందులో మండల విద్యా శాఖాధికారులు కన్వీనర్లుగా, ఎంపీడీవో చైర్మన్‌గా, తహసీల్దారు, సీడీపీవో, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది సభ్యులుగా కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ప్రవేశాలు చేసేందుకు, 6-14 వయస్సు పిల్లలు చదువుకు దూరమయ్యే పరిస్థితి లేకుండా చేయటం, బడి బయట ఉన్న వారిని గుర్తించి వారికి తిరిగి ప్రవేశాలు కల్పించటం ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. అనంతరం నాడు-నేడులో చేపట్టిన పనులు పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై వారికి పాఠశాలలో అందించిన వసతులపై ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నలుగురు టీచర్లకు మెమోలు

కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమయ పాలన పాటించని నలుగురు ఉపాధ్యాయులకు డీఈవో మెమోలు జారీ చేసి 24 గంటలలో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలకు చెందిన టి.మల్లికార్జున, ఎల్.అవన్యవతి, జి.గోవిందు నాయుడు, సీహెచ్ లోకనారాయణమ్మలు పాఠశాల తెరిచే నిర్దిష్ట 9-30 గంటలకు ఏ విధమైన సెలవు పెట్టకుండా హాజరు కాకపోవటాన్ని గుర్తించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే ఎలా? అని హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఆ నలుగురు ఆలస్యానికి కారణాలు ఏమిటో 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశిస్తూ వారికి మెమోలు జారీ చేశారు.

☛ సంక్షిప్తంగా..



విద్యార్థులతో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ సూరిబాబు

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు అరకు క్రీడా పాఠశాల విద్యార్థులు

అరకులోయ, జూన్ 20 : ఈ నెల 22 నుంచి 24 వరకు ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు అరకులోయ క్రీడాపాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్టు క్రీడాపాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. గురువారం ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలోని వాల్గా ఆర్చరీ అకాడమీలో జరగనున్న పోటీలకు అరకులోయ క్రీడాపాఠశాల నుంచి ఎస్.రాము (9వ తరగతి), వి.లలిత్‌సాయితేజ్ (8వ తరగతి), కె.హర్ష (7వ తరగతి)కి చెందిన ముగ్గురు విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. క్రీడాపాఠశాల ఆర్చరీ కోచ్ ఎల్.సూరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు పోటీలకు హాజరు అవుతున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదబయలు, జూన్ 20 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల సీతగుంటలోని ఇంటర్మీడియెట్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్టు ఏఎంవో భాస్కర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. అలాగే ఇంటర్‌లో చేరేబోయేవిద్యార్థులకు పుస్తకాలతో పాటు యూనిఫాం ఉచితంగా అందజేయనున్నట్టు పేర్కొన్నారు. కాగా ఇటీవలే జడ్పీ ఉన్నత పాఠశాలను ఇంటర్ ప్రవేశాలను అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే.

టీడీపీ నేత సన్యాసిరావుకు సతీవియోగం



వరలక్ష్మి (ఫైల్)

సీలేరు, జూన్ 20 : జీకే వీధిమండలం సీలేరు టీడీపీ అధ్యక్షుడు కొప్పు సన్యాసి రావు భార్య వరలక్ష్మి మృతి చెందారు. దీంతో సీలేరులో విషాదఛాయలు అలముకున్నాయి. వరలక్ష్మి కూడా టీడీపీలో స్థానికంగా చురుకైన నేతగా వ్యవహ రించేవారు. వారం రోజుల క్రితం గుండె, కిడ్నీలకు సంబంధించిన సమస్యలు తలెత్తడంతో హుటాహుటిన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేర్ అసుపత్రికి తరలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆమె బుధవారం సాయంత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గురువారం ఆమెకు సీలేరులో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీలేరులో సంతాప సూచకంగా వర్తకం సంఘం వారు దుకాణాలను బంద్ చేశారు. అత్యక్రియలో సీలేరు, ధారకొండ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ



విత్తరాలు అందజేస్తున్న సీఐ అశోక్‌కుమార్, ఏవో

గూడెంకొత్తవీధి, జూన్ 20 : ఆదివాసీ రైతులు గంజాయి సాగుకు దూరంగా ఉంటూ వ్యవసాయ పంటల్లో రాణించాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. గురువారం రింతాడ రైతు భరోసా కేంద్రంలో గిరిజన రైతులకు వ్యవసాయ అధికారి మధుసూదనరావుతో కలిసి రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన ప్రాంతంలో గంజాయి సాగును అరికట్టగలిగామన్నారు. రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీపై వరి, వేరుశనగ, రాజ్‌మా, చిరుధాన్యాల విత్తనాలను అందజేయడం జరుగుతుందన్నారు.

'ఇంటింటికీ కొళాయిలు' ప్రారంభం



కొళాయి ప్రారంభిస్తున్న పుల్లయ్య

జి.మాడుగుల, జూన్ 20 : హర్ ఘర్ జల్ ద్వారా సంపూర్ణ ఇంటింటికీ కులాయిలను సద్వినియోగించుకోవాలని డీపీఎంయూ జిల్లా కో-ఆర్డినేటర్లు పి.పుల్లయ్య, ఆనంద్ చెప్పారు. గెమ్మెలి పంచాయతీ కేంద్రంతో పాటు సంపంగిపుట్టు, తోకరాయి గ్రామాల్లో నిర్మించిన ఇంటింటికి కొళాయి పథకాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఈ మూడు గ్రామాలకు రూ.22.5 లక్షలతో గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ శివ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.విజయ్‌కుమార్, సర్పంచ్ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

'నీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలి'

గూడెంకొత్తవీధి, జూన్ 20 : బావులు, రక్షిత మంచి నీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎపిడమిక్ సీజన్ కావడంతో కార్యదర్శులు రక్షిత మంచి నీటి పథకాల ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఎక్కడా నీటి ఎద్దడిలేకుండగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

రూ.2.53 లక్షలకు సంత ఆశీలు వేలం పాట

ముంచంగిపుట్టు, జూన్ 20 : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సంత వేలం పాట నిర్వహించారు. మొత్తం 11 మంది ఈ వేలంపాటలో పాల్గొన్నారు. ఏడాది పాటు మండల కేంద్రంలో జరిగే ఆశీలు వసూళ్ల ప్రక్రియకు సంబంధించి వేలం పాట నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. రూ.2 లక్షల 53 వేలకు కించాయిపుట్టు గ్రామానికి చెందిన రొబ్బ గణపతి దక్కించుకున్నారని అన్నారు.

సంత ప్రాంగణంలో పరిసరాలు పరిశుభ్రతతో పాటు చెత్త తీసేందుకు, ఇతర పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను అతనికి అప్పగించడం జరుగుతుందని అన్నారు. వాటికి అవసరమైన ఆశీలను సంత వ్యాపారుల నుంచి వసూళ్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఆరో తరగతి, ఇంటర్ సీట్లు పెంపునకు ప్రతిపాదనలు

... 5వ పేజీ తరువాయి

ఉన్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లల బుక్స్, బూట్లు, దుస్తుల కోసం మండల కేంద్రాలలోని స్టాకు పాయింట్లకు వెళుతున్నారన్నారు. త్వరితగతిన స్టాకును తీసుకొని తరగతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించామన్నారు. మరోమారు పాఠశాలల తనిఖీల్లో ఏ లోపం ఉన్నా సహించేది లేదని డీడీ కొండల రావు స్పష్టం చేశారు. ఆశ్రమోన్నత పాఠశాలు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండాలన్నారు. టీచర్స్ సమయపాలన పాటించి, విధులకు హాజరు కావాలన్నారు. వసతి గృహాల్లో మెనూ పక్కాగా అమలు కావాలన్నారు.

వసతిగృహాలకు ఆ విద్యాసంవత్సరంలో కార్పెట్లు, బ్లాంకెట్లు సరఫరా చేయనున్నట్టు డీడీ కొండలరావు చెప్పారు.

ఈదురు గాలులకు ఇంటిపై కూలిన చెట్టు



ఇంటిపై కూలిన వేపచెట్టు

సీలేరు, జూన్ 20 : జీకేవీధి మండలం సీలేరులో గురువారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు భారీ వేపచెట్టు ఒక ఇంటపై పడింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సీలేరులో గల బాలాజీ రెస్టారెంట్ వెనుక వీధిలో గల రాజేంద్ర అనే గిరిజనుడి ఇంటి ముందు గల భారీ వేప చెట్టు గురువారం సాయంత్రం ఈదురు గాలలకు ఇంటిపై కూలిపోయింది. గాలులు వీచడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇంట్లో ఉన్న వారంతా ఇంటి బయటకు వచ్చేశారు. ఇదే సమయంలో చెట్టు ఇంటిపై కూలి ఇంటి పైకప్పు రేకులు ధ్వంసం అయ్యాయి. చెట్టు కూలిన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండుంటే పెను ప్రమాదం సంభవించేదని రాజేంద్ర కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

4 రోజులుగా అందని బీఎస్ఎన్ఎల్ సేవలు

ముంచంగిపుట్టు, జూన్ 20 : స్థానిక బీఎస్ఎన్ఎల్ టెలికాం సేవలు గత నాలుగు రోజులుగా గాలిలో దీపంలా మారింది. సమాచార వ్యవస్థ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దాని కారణంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ సక్రమంగా పని చేయలేదు. దీంతో స్టేట్‌బ్యాంక్‌లో పలు ఆన్‌లైన్ పనులకు అవరోధం ఏర్పడింది. అలాగే ఇంటర్‌నెట్ లేక వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సమాచార వ్యవస్థ నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

గుళి సాగుతో రాగి రెట్టింపు దిగుబడి

... 5వ పేజీ తరువాయి

భద్రపర్చుకోవాలి) నారుమడిలో వేసుకోవాలి.

జీవామృతంతో విత్తన శుద్ధి..

ఎంపిక చేసుకున్న రాగి విత్తనాలను జీవామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలి. 300 గ్రాముల విత్తనం శుద్ధికి 200ఎంఎం జీవామృతం సరిపోతుంది.

నారు..

విత్తనశుద్ధి చేసుకున్న విత్తనాలను రెండు గంటల పాటు నీడలో ఎండబెట్టుకుని ముందుగా సిద్ధం చేసుకున్న మడిలో నారు పోసుకోవాలి. నారుమడిలో విత్తనాలు వేసుకున్న తరువాత ఎండుగడ్డిని వేసుకోవాలి. అనంతరం జీవామృతం (20 లీటర్ల నీరు, ఐదు కిలోల ఆవు పేడ, ఐదు లీటర్ల మూత్రం, 200 గ్రాములు శనగపిండి, కొద్దిగా పుట్టమట్టి కలుపుకోవాలి) నారుమడిపై విడతలవారీగా చిలకరించుకోవాలి. మూడు రోజుల తరువాత మొక్కలు వచ్చిన తరువాత ఎండుగడ్డిని తొలగించుకోవాలి. ప్రతిరోజు మొక్కలను నీటితో తడుపుకోవాలి. జూన్ రెండో పక్షం నుంచి జూలై నెలాఖరు వరకు నారు పోసుకోవచ్చు.

పంట పొలం తయారీ..

రాగి నాట్లు వేసుకునేందుకు రెండు, మూడు దుక్కులు చేసుకుని పంట పొలం సిద్ధం చేసుకోవాలి. అఖరి దుక్కులో ఎకరానికి ఘనజీవామృతం 400 కిలోలు వేసుకుని కలియ దున్నుకోవాలి.

గుళి పద్దతిలో నాట్లు..

వర్షాలు కురిసిన వెంటనే నాట్లు వేసుకోవాలి. 12-14 రోజుల వయస్సు కలిగిన నారును మాత్రమే నాటుకోవాలి. వరిలో శ్రీపద్ధతి అనుసరించిన మాదిరిగా గుళి రాగి పద్ధతిలో నాట్లు వేసుకోవాలి. మొక్కలు, వరుసల మధ్య అడుగు ఎడం పాటిస్తూ మొక్కలను నాటుకోవాలి. నాట్లు లైన్లుగా వేసుకునేందుకు తాడును ఉపయోగించాల్సి ఉంటుంది. ఒకటి, రెండు మొక్కలను మాత్రమే నాటుకోవాలి. నేలలో మొక్క వేర్లు లోపలకు వెళ్లినంతగా 10 ఎంఎం లోతులోనే నాటుకోవాలి. మొక్కలను లోతుగా నాటుకోరాదు. జూలై మొదటి వారం నుంచి ఆగస్టు మొదటి వారం వరకు నాట్లు వేసుకోవచ్చు.

సస్యరక్షణ..

నాట్లు వేసుకున్న 20 రోజులకు జీవామృతాన్ని మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. ఏడురోజుల పాటు నీడలో భద్రపర్చుకుని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కలుపుతూ ఉండాలి.

ఈ విధంగా సిద్ధం చేసుకున్న జీవామృతాన్ని గుడ్డతో రెండు సార్లు వడగట్టుకుని మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. ఈవిధంగా 20-30రోజుల వ్యవధిలో పంటకాలలో మూడుసార్లు పిచికారి చేసుకోవాలి.

చెక్కలాగుట..

గుళి పద్ధతిలో చెక్కలాగుట చాలా కీలకం. మొక్కలు నాటుకున్న 15 రోజులకు ఒకసారి చొప్పున మూడు సార్లు తేలిక పాటి చెక్కను మొక్కలపై నుంచి లాగాలి. ఈవిధంగా చేయడం వల్ల మొక్కలు వంగి నేలకు తాకి అధిక సంఖ్యలో పిలకలు మొలకెత్తుతాయి.

కలుపు నివారణ..

సైకిల్ వీడర్ సాయంతో కలుపు నివారించుకోవాలి. సైకిల్ వీడర్‌ని మొక్కలు, వరుసల మధ్య నడిపిస్తే కలుపు మొక్కలు భూమిలో కలిసిపోతాయి. ప్రతి 20 రోజులకు ఒకసారి సైకిల్ వీడర్‌ని నడిపించుకుని కలుపు నివారించుకోవాలి.